విశాలాంధ్ర కృష్ణా జిల్లా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఏపీఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి తాటిపర్తి తాతయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ఫెడరేషన్ పిలుపులో మున్సిపల్ వర్కర్లు యూనియన్ ఏఐటీయూసీ, మచిలీపట్నం బ్రాంచి & వర్కర్లు యూనియన్ సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాతయ్య పాల్గొని, మాట్లాడుతూ ఏపీఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రూ.6 వేల హెల్త్ అలవెన్స్ 2020లో 3 నెలలు, 2022లో 2 నెలలు హెల్త్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను ప్రభుత్వం అమలుచేసి, మున్సిపల్ కార్మికుడు చనిపోతే, వారి కుటుంబంలో ఆ ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు. సీఐటీయూ నాయకులు సిహెచ్ జయరాం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశం పెట్టినటువంటి ఈఎ.పి.ఎఫ్.ఆర్.ఎస్. విధానాన్ని కార్మికుడు ఫొటోను తీసుకొని పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ప్రవేశ పెట్టడం సరికాదన్నారు. అనంతరం కార్యాలయం మేనేజర్ అశ్విన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి కరపాటి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజర్ కార్యదర్శి యర్రంశెట్టి ఈశ్వరరావు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి లింగం ఫిలిప్, కర్నాటి అర్జున్‌రావు, దుర్గారావు, దుర్గా ప్రసన్నుడు, ఎస్.లలిత, మన్నె జ్యోతి, కరపాటి కరపాటి స్వామి, దళాయి శివరామ ప్రసాద్, యర్రంశెట్టి శ్రీమన్నారాయణ, జూనపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి హేయం

విశాలాంధ్ర-గన్నవరం : వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యాలయంపై దాడిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి తాటిపర్తి తాతయ్య ఖండించారు. గన్నవరం సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాతయ్య మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఎంతో మంది పోటీ చేశారని, అయితే రాజకీయపార్టీ విమర్శలు తప్పా వ్యక్తిగత విమర్శలు ఘర్షణలు జరగలేదని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజాస్వామ్యానికి ఏటువంటి విఘాతాలు జరగలేదన్నారు. అధికార, ప్రతిపక్షపార్టీలు ప్రజల మన్ననలు పొందుతూ వచ్చాయని, ప్రస్తుత పరిస్థితిలో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు వ్యక్తిగత దూషణలు ఘర్షణకు దారితీసాయని, వ్యక్తిగతంగా విమర్శలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వైఫల్యాలని కప్పిపుచ్చుకోవటానికి, ప్రజాసమస్యలను తప్పుద్రోవ పట్టించటానికి, ప్రజలను భయభ్రాంతులు గురిచేస్తున్నాయని, ఈ చర్యలకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గన్నవరం కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, జిల్లా రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కమాల ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పెద్దు వెంకటరత్నం, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, బందారు లక్ష్మయ్య, సభ్యులు సామల విజయ్, రేమల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మాతృభాష తీయదనాన్ని తెలియ చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం స్మృతి వనంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ భాష కేవలం భావాలు వ్యక్తం చేయడానికి ఉపయోగపడే సాధనమే కాదని, ఒక జాతి ఉనికిని, సంస్కృతిని మొత్తంగా జీవన విధానాన్నే పరిచయం చేస్తుందన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారని, తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పతనం ఇక ఏ భాషలోనూ లేదని చాలా మంది కవులు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రేక్షకపాత్ర : కొనకళ్ల

విశాలాంధ్ర-మచిలీపట్నం : పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. మంగళవారం గన్నవరంలో ప్రతిపక్ష పార్టీల కార్యాలయాల మీద దాడి జరిగిన సంఘటన సందర్భంగా కొనకళ్ళ నారాయణరావు ని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ వల్లభనేని వంశీ, కొడాలి నాని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ని నోటికొచ్చిందల్లా మాట్లాడుతుంటే చర్యలు తీసుకొని ఈ పోలీసులు పట్టాభి ఏదో మాట్లాడాడని వైఎస్ఆర్సిపి గూండాలు నానా రాద్ధాంతం చేయడం అది చూస్తూ పోలీసులు ఉండడం ఈ సమాజానికి ఏ సందేశం ఇస్తున్నారు అని ఆయన సూటిగా ప్రశ్నించారు. పదవులు శాశ్వతం కాదని, వైయస్సార్ సిపి నాయకులు తెలుసుకోవాలని అయిన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు .

పట్టాభిని మాకు చూపించండి: వెనిగండ్ల రాము

విశాలాంధ్ర-గన్నవరం/గుడివాడ : తెలుగుదేశం సీనియర్ నాయకులు పట్టాభిని మాకు చూపించాలని గుడివాడ సీనియర్ నాయకులు వెనిగండ్ల రాము డిమాండ్ చేశారు. గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పట్టాభిని పరామర్శించేందుకు మంగళవారం వచ్చిన వెనిగండ్ల రాముని వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గన్నవరం టిడిపి కార్యాలయం లో ఫర్నిచర్ ధ్వంసం చేసి కారులకు నిప్పు పెట్టిన వైసిపి నాయకులది అనైక్య చర్య అన్నారు.మా నాయకులు పట్టాభిని రాత్రి నుండి పోలీసులు అదుపులోకి తీసుకొని ఇప్పటి వరకు చూపించలేదని, పట్టాభి ని మాకు వెంటనే చూపించాలి అని డిమెండ్ చేశారు. వైసిపి నాయకులకు పోలీసులు భయపడి మా టిడిపి నాయకులను అరెస్ట్ చేయటం ఏమిటి అని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కోర్టుకు హాజరు పరుస్తున్న పట్టాభిని కలసి మనోధైర్యాని నింపిన వెనిగండ్ల రాము

గృహ నిర్మాణాలు వేగవంతం

విశాలాంధ్ర-పెదపారుపూడి : గృహ నిర్మాణాలు ప్రారంభించి, వేగవంతం చేయాలని ఎంపీడీవో టి. సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ రెండు సచివాలయాల పరిధిలోని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులతో, సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన శాశ్వత గృహ పథకంలో భాగంగా ఆయా స్థలాలలో లబ్దిదారులతో ఇంటి నిర్మాణాలు ప్రారంభించే విధంగా తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని అన్నారు. అందుకుగాను మండలంలోని 19 పంచాయతీ పరిధిలోని 9 సచివాలయాల లో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించిందని అన్నారు. భూషణగుళ్ళకు వ్యవసాయ అధికారి ఎస్. త్రినాథ ఆంజనేయరావును, పాములపాడుకు ఈవో పి ఆర్ డి ఎం. నాగిరెడ్డిని, మోపర్రుకు పంచాయతీ రాజ్ ఏ ఈ డి. రామ్మోహన్ రావును, వెంట్రప్రగడ ఒకటికి ఏవో ఎం. వి. రమణారావును, వెంట్రప్రగడ రెండుకి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షహనాజ్ ను, వానపాములకు హౌసింగ్ ఏఈ ఎన్. మల్లికార్జునరావును, పెదపారుపూడికి ఏపీవో స్ఫూర్తిని, చినపారుపూడికి ఏపిఎం కె. వసంతరావును, యలమర్రుకు డాక్టర్ హెచ్. జయంత్ ను సచివాలయాల పరిధిలో ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి సాగర్ రాణి, అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

బాపులపాడు సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్ ప్రారంభం.

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : బాపులపాడు సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్ నూతన భవన నిర్మాణాన్ని మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ శంకుస్థాపనను గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్,కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు చెక్కులను పంపిణీ చేసారు. అనంతరం స్థలాన్ని విక్రయించిన వారిని సన్మానించారు, ప్రజా సేవకుడు, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే వంశీమోహన్ కార్యాలయం మీద తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడికి పాల్పడం అవివేకం అన్నారు.వంశీకి ప్రజామిమానం ఉందని,వచ్చే ఎన్నికలలో కూడ వంశీయే బారి మెజారిటితో గెలుస్తాడని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పలుగ్రామాల సొసైటి అద్యకులు,కార్యదర్శులు, బ్యాంకు సియిఓ శ్యాంమోహన్,యంపిపి నగేష్, జడ్‌పిటిసి, బాపులపాడు సర్పంచ్, నక్కా గాంధీ, పాల్గొన్నారు.

ఆక్వాజోన్ పరిధిలోని భూములు పరిశీలించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో ఆక్వా జోన్ పరిధిలోని భూములను రీవెరిఫై చేసి ప్రభుత్వానికి రిపోర్టును సమర్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్లో ఆయన మత్స్య, వ్యవసాయ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారులతో ఆక్వా జోన్ డిక్లరేషన్ అంశంపై జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి నాన్ ఆక్వాజోన్ పరిధిలో ఉన్న అర్హత గల భూములను ఆక్వా జోన్ పరిధిలో చేర్చే క్రమంలో భూములను రీవెరిఫై చేయాలన్నారు. జిల్లాలో ఆక్వా జోన్ పరిధిలో ఉన్న 13 మండలాల్లోని భూములను వెరిఫై చేయాలని, వీటిలో ప్రభుత్వ భూములు, పోరంబోకు, అభ్యంతరకర భూముల్లో ఆక్వా సాగు భూములను గుర్తించాలన్నారు. అర్హతగల భూములను ఆక్వా జోన్లో చేర్చడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందడంతో పాటు ఆ పరిధిలో మౌలిక సదుపాయాలైన రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయ జరుగుతుందన్నారు. లైసెన్సులను పొందడంలో రైతులకు సులువుగా ఉంటుందన్నారు. తద్వారా ఆక్వా సాగులో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్న జిల్లాను మత్స్య ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ జేడి ఎన్.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, తహసీల్దార్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు..

విశాలాంధ్ర -కూచిపూడి : కృష్ణాజిల్లా స్థాయిలో మచిలీపట్నం లో సోమవారం జరిగిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ లో మ్యాథమెటికల్ మోడలింగ్.లో మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన ఇన్నోవేటివ్ ఐడియాస్ ఇన్ మాథ్స్ అంశం రెండవ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి తరలి వెళ్ళనుంది. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకట శ్రీధర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నెలలో 18 వ తారీఖున మండల స్థాయిలో జరిగిన ప్రదర్శనలో ఈ అంశం జిల్లాకు ఎంపికైందని వివరించారు. ఈనెల 28వ తారీఖున విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అంశాన్ని రూపొందించిన విద్యార్థిని జే సింధు తో పాటు గైడ్ టీచర్ మేకారాణి (లెక్కల టీచర్) పాల్గొంటారని వివరించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 23వ తేదీన పెన్షన్ దారులకు ఉచిత వైద్యశిభిరం నిర్వహిస్తున్నామని గన్నవరం రిటర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆవుటపల్లి మోహనరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం బుద్దవారం రోడ్డు లో గల రిటర్డ్ ఉద్యోగుల భవనంలో కృష్ణ సాయి డెంటల్ డాక్టర్లు, విజయవాడ వారు మ్యాక్స్ విజన్ కంటి డాక్టర్లు ఉచితం గా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.గన్నవరం సబ్ ట్రెజరీ నందు గల రిటర్డ్ ఉద్యోగులు తమ ఐడి కార్డులు ఆధారకార్డు తీసుకొనిరవాలి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.రిటర్డ్ ఉద్యోగులు ఈ నెల 28 తేదీ లో లైఫ్ సర్టిఫికేట్ లు సబ్ ట్రెజరిలో దాఖలు చేయాలన్నారు.

అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయి ఛాంపియన్లుగా

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 42వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో స్టేడియం అథ్లెటిక్స్‌లో 45 సంవత్సరాల పై బడిన కీడాకారులు ఛాంపియన్లుగా నిలవడం అభినందనీయమని ఎన్‌టిఆర్ కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్తా కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో క్రీడాకారలు కె.వి నాగులు, టి.వెంకటేశ్వర్లు, సి.హెచ్ అప్పలస్వామి, జి.పి చౌదరి, పి.సుధాకార్, కె.వెంకటేశ్వరరావు, వి.రామ్‌ప్రసాద్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బోగ్గవరపు తిరపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టర్స్ ఛాంపియన్లుగా స్టేడియం క్రీడాకారులు

ఇటీవల కృష్ణాజిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఎన్‌టిఆర్ స్టేడియం జిమ్‌కు చెందిన వెయిట్‌లిఫ్టర్లు ఛాంపియన్లుగా నిలిచిన ఎం.కుమార్‌రాజా, జి.సుభాషిని, బి.మణిదీపక్‌లు వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాదించడం అభినందనీమాని ఎన్‌టిఆర్ కమిటి ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్తా కార్యదర్శి పర్వతనేని ఆనంద్‌లు అన్నారు. పవర్‌లిఫ్టింగ్‌లో ఎం.కుమార్‌రాజా, పిజాన్‌బాబు, ఎ.మోహనకృష్ణ, కె.జ్యోత్స్నలు బంగారు పతకం సాధించడం గోప్ప విషయమాని స్టేడియం కమిటి సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిమ్‌కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, సంపా ఉషాకుమారి, స్టేడియం మేనేజర్ సత్యనారయణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఉత్పత్తిని పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

విశాలాంధ్ర-ఘంటసాల: కేవికె ద్వారా రైతుల ద్వారా వేసిన మినుము విత్తన ఉత్పత్తి (సీడ్ హబ్) పొలాలను ఏపీ ఎస్.ఎస్.సి.ఎ. జేడీ బి.విశ్వనాథం, కేవికె శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఘంటసాల కేవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఎల్బీజి 752, ఎల్బీజి 787 మినుము విత్తనాల ఉత్పత్తిని పెంచేందుకు వివిధ రైతులకు చెందిన 157 ఎకరాల్లో పండించడం జరుగుతుందన్నారు. ఆయా పొలాలను ఏపీ ఎస్.ఎస్.సి.ఎ. జాయింట్ డైరెక్టర్ బి.విశ్వనాథం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కేవికె పొలాల్లో వేసిన వివిధ రకాల బ్రీడర్ సీడ్ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్ సర్టిఫికేషన్ ఎమ్.వెంకట లక్ష్మీ, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ వేములయ్య, ఏపీ సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కృష్ణా జిల్లా మేనేజర్ అనిత, సి.ఎస్.సి.ఓ.ఆఫ్ ఏపీ ఎస్.ఎస్.సి.ఎ. రిటైర్డు ఆఫీసర్ గొర్రెపాటి పేరయ్య చౌదరి, కేవికె క్రాఫ్ట్ ప్రొడక్షన్ శాస్త్రవేత్త ఎమ్.వెంకట లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నేత బొడ్డు వేణు గృహ నిర్బంధం

విశాలాంధ్ర-పెడన : గన్నవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై వైకాపా దాడులు చేసిన నేపథ్యంలో ముందస్తుగా తెలుగుదేశం పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గన్నవరం బయలుదేరిన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుమంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై వైకాపా గుండాలు విధ్వంసనకు పాల్పడ్డాన్ని బొడ్డు వేణుగోపాలరావు తీవ్రంగా ఖండించారు.

పిన్నమనేని బాబ్జీ హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర-గుడివాడ : గన్నవరంలో జరిగిన ఘటన ఖండిస్తూ గన్నవరం తెలుగుదేశం పార్టీ నాయకులకు మద్దతు తెలిపినందుకు టిడిపి నాయకులు అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ)ని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక భాస్కర్ దియెటర్‌లోని పిన్నమనేని బాబ్జిను 2టౌన్ సిఐ తులసీధర్ తన సిబ్బందితో హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ వైకాపా నాయకులు గుండాలను ప్రేరేపించి తెలుగుదేశం పార్టీ నాయకుల పై కార్యకర్తలపై, కార్యాలయాలపై దాడులు చేయించడమే కాకుండా జరిగిన దాడిని ఖండించేందుకు వెళ్తున్న టిడిపి నాయకులను హౌస్ అరెస్టులు చేయడం దారుణమని ఖండించారు. వినాశకాలే విపరీత బుద్ధి అనే విధంగా వైకాపా ప్రవర్తిస్తుందని, ప్రతిపక్షాలు గళం ఎత్తితే భయపడి పోలీసులతో అక్రమ అరెస్టులు చేయిస్తున్నారంటూ మండిపడ్డారు.

ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర ధరలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : సామాన్యునికి అందుబాటులో లేకుండా నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. తెలుగు దేశం పార్టీ ఆద్వర్యంలో ఈదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రామకోటిపురం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి మచ్చుకైన కనిపించడం లేదని తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వస్తేనే కానీ రాష్ట్రం అన్నీ రంగాలలో అభివృద్ధి చెంది యువతకి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ నాయకులు బొప్పన నందం, బొప్పన కాశీ విశ్వేశ్వరరావు, యలవర్తి చిన్న, పులిగడ్డ నాంచారయ్య, బర్మా శ్రీనివాసరావు, బొప్పన శేషారావు, యలవర్తి రవీంద్ర, పరిమిశెట్టి శేఖర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

భాషా ద్రోహి జగన్ : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మాతృభాష పరిరక్షణ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేకుండా భాషా ద్రోహానికి పాల్పడుతుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ యునెస్కో ప్రాథమిక విద్య మాతృభాషలో జరపాలని, మాతృభాషలు మృత భాషలు కాకుండా చూసుకోవాలని అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని ఏర్పరిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమాన్ని తీసేసి ప్రాథమిక విద్యను కూడా ఇంగ్లీషు లోనే బోధిస్తున్నారని ఫలితంగా వారి పేరు కూడా తెలుగులో రాసే పరిస్థితి లేదని మండలి పేర్కొన్నారు. అక్షరాలు నేర్పని జాతిని రాష్ట్ర ప్రభుత్వం తయారు చేస్తుందని తెలుగు భాష కోసం ఏర్పరచిన అధికార భాషా సంఘం తెలుగు అకాడమీ , సాహిత్య అకాడమీ లాంటి సంస్థలను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వేసారని కేవలం తన అనుయాలకు పదవులు ఇచ్చి జీతాభత్యాలు చెల్లిస్తున్నారే తప్ప భాష కోసం చేసింది శూన్యం అని బుద్ధప్రసాద్ విమర్శించారు. ఇప్పటికైనా తెలుగు వారు మేల్కొని భాషని కాపాడుకోవాలని భాషాపూర్వకంగా ఏర్పడిన జాతిని నిలుపుకోవాలని బుద్ధప్రసాద్ కోరారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

విశాలాంధ్ర-కూచిపూడి : మండలంలోని 21 గ్రామపంచాయతీలలో ఇంటి పన్ను ఈ నెలాఖరునాటికి 65 శాతం పూర్తి చేయాలని మొవ్వ మండలఈఓపిఆర్డి వీర్ల సీతారామరాజు కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామాల వారీగా వసువులపై ఆరా తీశారు. మండలంలో బకాయిలతో కలిపి?.1.80 కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికీ 47% మాత్రమే వసూళ్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెలాఖరునాటికి ఎట్టి పరిస్థితిలోనూ లక్ష్యాన్ని పూర్తి చేయాలని హెచ్చరించారు. అలాగే మార్చి నెల ఆఖరికి 90 నుంచి నూరు శాతం వసూళ్లపై దృష్టి సారించమని పేర్కొన్నారు. ఈయనతోపాటు కాజ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి ఏ డి వి ఎల్ ప్రసాద్.పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పని సరి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మోటారు వాహనాలను నడుపువారు హెల్మెట్‌లను తప్పని సరిగా ధరించాలని స్థానిక ఎస్. ఐ. వలదాసి ఏసోబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాహనాలను నడుపు సమయంలో హెల్మెట్ ఉపయోగించని యొడల ప్రమాద సమయంలో ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని తద్వారా కుటుంబ సభ్యులు అనాధలుగా మిగిలిపోతారని చెప్పారు. వాహన దారులందరూ తమ వాహనాలకు సంబందించి డ్రైవింగ్ లైసెన్సును విధిగా కలిగి యుండాలనీ, ఆయా వాహనాల కొనుగోలుకు చెందిన ధృవ పత్రాన్నీ, రోడ్డు టేక్స్(ఆర్. సి) ని తమ దగ్గర ఉంచుకోవాలని ఎస్. ఐ. సూచించారు.

సాటిలేనిది తెలుగు భాష

విశాలాంధ్ర-అవనిగడ్డ : తెలుగు భాష తియ్యనిది మరేభాషకు సాటిరానిదని ప్రముఖ కవి పండితుడు డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. గాంధీక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మాతృభాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీక్షేత్ర ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య వర్త గా డాక్టర్ పాలపర్తి శ్యామలానంద్ పాల్గొని మాట్లాడుతూ తెలుగులో మాట్లాడటం రాయడంలోనూ తెలుగు భాషకు ప్రాణం పోసిన వారమవుతారన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స గా చెప్పుకునే త్యాగరాజ కీర్తనలు సయితం తమిళలు తెలుగులోనే అధ్యయనం చేశారని గుర్తుచేశారు. తెలుగు తేనె లాంటిదని మనకు ఏ కష్టం వచ్చినా మనం పిలిచేది తెలుగులోని అమ్మను మాత్రమే అని అన్నారు. ముందుగా తెలుగుతల్లి విగ్రహానికి శ్యామలానంద ప్రసాద్ పూలమాల వేయగా పులిగడ్డ మాజీ సర్పంచ్ చెన్ను గాంధీ , కూనపరెడ్డి చంద్రశేఖర్, యలవర్తి చిన్న, మత్తి ప్రసాద్, మైలా హరిబాబు లతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను కోర్టుకు హాజరుపరిచిన పోలీసులు

విశాలాంధ్ర-గన్నవరం : పట్టణంలో వైసీపీ, టీడీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. ఘర్షణకు కారణమైన టిడిపి నాయకులు 15 మందిని అరెస్టు చేశారు. పట్టాభితోపాటు 15 మందిని గన్నవరం కోర్టుకు హాజరుపరిచారు.

కార్యకర్తలకు అండగా : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-పమిడిముక్కల: నియోజకవర్గంలో వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే నా ధ్యేయమని పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం లంకపల్లి గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కులమత వర్గ బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేనని పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రజలు ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరిగేవారని ప్రస్తుతం మన ముఖ్యమంత్రి ఆ పరిస్థితి లేకుండా ప్రతి గ్రామంలో సచివాలయాలు ఏర్పాటు చేసి సమస్యను వెంటనే పరిష్కరించేటట్టు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్న మన వైసీపీ పార్టీని మరల అధికారంలోకి తేవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి రత్నకుమారి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు వైస్ ఎంపీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొడమంచిలి మహేష్, జి. సీతారామయ్య మారపాక మహేష్ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు చంద్రపాల్ పరసా జగన్ పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై చర్చకు సిద్ధం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఏమాత్రం దుర్వినియోగానికి గురి కావడంలేదని ఎస్సీ వర్గాల సంక్షేమానికి గత ఏప్రభుత్వం అమలు చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగంపై ఎటువంటి చర్చకైన సిద్ధమని ఎస్సీ కమీషన్ సభ్యులు సీహెచ్.అనంద ప్రకాష్, కే.పుల్లారావు తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగంపై ఎస్సీ కమీషన్ సభ్యులు సీహెచ్.అనంద ప్రకాష్, కే.పుల్లారావు మంగళవారం స్వరాజ్య మైదానంలో మీడియాతో మాట్లాడారు. సబ్‌ప్లాన్ విధులు దుర్వినియోగం అవుతున్నాయని ఇటీవల ప్రతి పక్షాలకు చెందిన కొందరు స్వార్థ దళిత నాయకులు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి చర్య దళితుల్లో ఐక్యతను దెబ్బతీసే కుట్రగా భావిస్తున్నామని ఇది దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి విఘాతం అవుతుందని ఇటువంటి చర్యలను మానుకోవాలని హితవు పలుకారు. ఎస్సీ కమీషన్ దళితలపై దాడులను ఉపేక్షించబోదని, దళితలకు ఎటువంటి అన్యాయం జరిగిన న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో మహిళలకు మేలు

విశాలాంధ్ర-ఘంటసాల: కృషి విజ్ఞాన్ కేంద్రం, ఆచార్య ఎన్ జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతియ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ వారి సహకారంతో మహిళలకు చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారిపై కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ పి శ్రీలత ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ చేపలతో మహిళలు ఇంటి వద్దే పలు ఆహార పదార్థాలును తయారు చేసి స్వయం ఉపాది పొందే మార్గాలను నేర్చుకోవాలని మరియు గ్రామిణ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ శిక్షణలు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. జె. యశ్వంత్ కుమార్, మత్స్య శాస్త్రవేత్త మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో చేపల పచ్చడి, రొయ్యల పచ్చడి, చేప కట్లెట్, చేప బాల్స్, చేప ఫింగర్స్, చేప మురుకులు మరియు చేప/రొయ్య సమోసా తయారీ గురించి ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం లో నేర్పటం జరుగుతుంది అని తెలిపారు. మత్స్య సంపద ఎక్కువగా ఉన్న గ్రామాలలో కాలానుగుణంగా ధర ఉన్నా లేకున్నా చేపలను మార్కెట్ లో అమ్మేస్తారు. గిట్టుబాటు ధర రాని సమయంలో చేపలతో పలు రకాల పదార్థాలు తయారీ ద్వారా సంపద నష్ట పోకుండా లాభం చేకుర్చుకోవచ్చు. ఈ కార్యక్రమంలో డా: మంజువాణి, శ్రీమతి కృష్ణ వేణి, డా: రేవతి, డా: వెంకటలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన నేను మాకరాజు లక్ష్మీ సాయి వర్మ తండ్రి మాకరాజు వెంకట బసవ రాజు డోర్ నెం:8-74/2 ది.14/2/2023 నా జిరాక్స్ నిమిత్తం కపిలేశ్వరపురం నుంచి వీరంకిలాకు వస్తుండగా మార్గమధ్యంలో నా పదవ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ రోల్ నెం:1713121959 ఇతర కాగితాల సంచి ఎక్కడో జారిపోయింది. నేను వెంటనే రహదారి వెంట అందరిని వాకబు చేసిన నేటి వరకు ఫలితం లేదు.ఎవ్వరికైన సదరు సర్టిఫికెట్ దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు తెలియపరచగలరు.

మాకరాజు లక్ష్మీ సాయి వర్మ
తండ్రి వెంకట బసవరాజు
కపిలేశ్వరపురం, పమిడిముక్కల (మండలం)
సెల్ నెం:8790499736

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, కానూరు కాపురస్తులు శ్రీ పాకనాటి వెంకటేశ్వర్లు, తండ్రి: వీరయ్య గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునదేమనగా నా క్లయింటు అయిన పాకనాటి వెంకటేశ్వర్లు గారు వారికి యర్రగొండపాలెం సబ్‌రిజిష్టర్ కార్యాలయం నందు రిజిష్టర్ చేసి ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1111/2017 ను తీసుకుని ది. 05-02-2023వ తేదీన కృష్ణాజిల్లా, వై.యస్.ఆర్. తాడిగడప మున్సిపాలిటీ ఏరియాలోని కామయ్యతోపు మండి కానూరు వరకు ఆటోలో వెళుతూ వుండగా పైన తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంటు పోవుట జరిగినది. నా క్లయింట్ అనేక విధములుగా వెతికినను సదరు డాక్యుమెంట్ లభించి యుండలేదు. సదరు పై తెలిపిన డాక్యుమెంట్ నా క్లయింట్‌కు ముఖ్య అవసరమై యున్నది. కావున ఎవరికైనను దొరికినచో ఈ క్రింది అడ్రస్ నందు అందచేయగలరు.

పి. రాజా, న్యాయవాది
జయరామ్ టవర్స్, కానూరు, విజయవాడ-7
కానూరు 21-02-2023 ఫోన్ : 95058 95058

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

నాయకుల వైఫల్యంతో ఎండమావిగా
చింతలపూడి ఎత్తిపోతల పథకం

విశాలాంధ్ర-మైలవరం: గత పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లాల విభజనా నతరం ప్రస్తుతం ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని మెట్టప్రాంతాలకు తాగునీరు, సాగునీరందించాలన్న లక్ష్యంతో రూపొందించిన చింతలపూడి ఎత్తిపోతల పథకం స్టేజ్ 1, స్టేజ్ 2లు నిర్మాణం దశలోనే అసంపూర్తిగా ఆగిపోయి, ఈ పథకాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న 3 జిల్లాల మెట్ట ప్రాంత రైతులకు ఈ పథకం ఎండ మావిగానే మిగిలిపోయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు జిల్లా బృందం తరపున తీవ్రంగా విమర్శించారు. సీహెచ్ కోటేశ్వరరావు బృందం జిల్లా సీపీఐ నాయకులు తూము కృష్ణయ్య, ఎస్కే నాగులమీరా, బుడ్డి రమేష్, చిలుకూరి వెంకటేశ్వరరావు, యం త్యాగరాజ్, తదితరులతో కూడిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా బృందం సోమవారం ఏలూరు జిల్లా చాట్రాయి మండలంలోని చీపురుగూడెం గ్రామంలోని స్టేజ్ 11, ఈక్విడెక్ట్‌ను పరిశీలించి, మంగళవారం వివరాలు విలేకరులకు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ నాయ కత్వంలో ఈ నెల 13వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టలను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా సోమవారం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా బృందం చీపురుగూడెం, ఈక్విడెక్ట్‌ను చేరుకుని పోలవరం ప్రాజెక్ట్ పథకం పరిశీలన ఎక్కువ సమయం పడుతుండటంతో ఇక్కడికి రాలేకపోయారని మరొక రోజుకు వాయిదా వేసిన కారణంగా జిల్లా బృందం పరిశీలించిందని కోటేశ్వరరావు తెలిపారు. అక్విడేట్ జమ్మిగడ్డిలో, పాడుబడిన కట్టడాలతోజోగుతుందని కాలువ తవ్వకాలలో సహా సంవత్సరం తరబడి ఆగిపోవడం ఈ ప్రభుత్వ పథకాన్ని పూర్తి చేయాలని చిత్తశుద్ధి ఏమాత్రం లేదని అన్నారు. ఎంతోమంది రైతులు తమ భూములను అప్పగిం చారని ఈ ప్రాజెక్టు పూర్తయితే ఎంతో మంది రైతులు వ్యవసాయ చెరువులను నీటితోనింపి రిజర్వాయర్‌లుగా మార్చడంతో భూగర్భజలాలు అభివృద్ధి సాగునీటి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఏర్పడుతుందని, ఎన్నో ఆశలు పెట్టుకున్న ఈ జిల్లాలోని మెట్టప్రాంత రైతులు సామాన్య ప్రజలకు ఈ పథకం ఎండమావిగానే మిగిలిపోయిందని కోటేశ్వరరావు అన్నారు. ఇప్పటికైనా యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం ఈ పథక నిర్మాణంను పూర్తి చేసి, ఈ మూడు జిల్లాల అభివృద్ధికి తోడ్పడాలని సీపీఐ బృందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

వాంబేకాలనీ శ్మశాన వాటికలో షెడ్ నిర్మించాలి

విశాలాంధ్ర-విజయవాడ : విజయవాడ బాంబే కాలనీలో హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియల నిర్వహణ కోసం షెడ్ నిర్మించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ 59, 60, 61, 62 డివిజన్ శాఖల ఆధ్వర్యంలో సింగ్ నగర్ హిందూ స్మశాన వాటికను సీపీఐ బృందం మంగళవారం పరిశీలించింది. అనంతర కోటేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా ఈ ప్రభుత్వ వ్యవహరిస్తుందని ఎద్దేవ చేశారు. ఈ ప్రభుత్వ హయ్యాంలో మనిషి బ్రతికి ఉన్నప్పుడు సుఖ శాంతులు లేకుండా పోయాయని ఆరోపించారు. చనిపోయినప్పుడైనా ప్రశాంతమైన వాతావరణంలో దహన సంస్కారం చేసుకోవాలంటే నానా ఇబ్బందులు పడాల్సిన వస్తుందన్నారు. దహన సంస్కారాలు చేయటానికి వర్షాకాలంలో ఇబ్బందిగా ఉందని షెడ్డు నిర్మాణం చేయమని అడిగితే తాత్కాలికంగా అప్పటి వరకు ఉన్న షెడ్డును కూడా పీకేశారని మండిపడ్డారు. స్మశాన వాటికలో వారం రోజుల్లో షెడు నిర్మాణం చేస్తామని చెప్పిన స్థానిక నాయకులు ఇంతవరకు నిర్మాణం చేయలేదన్నారు. ఆఖరిమజిలీలో గౌరప్రదంగా అంత్యక్రియలు నిర్వహించుకోవటం కోసం ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటిలో వెంటనే షెడు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీగా ఆధ్వర్యంలో షెడ్డు వచ్చేవరకు పోరాటం చేస్తామని హెచ్చరిచారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు ఎల్.శివకుమార్, 59వ డివిజన్ కార్యదర్శి సుభాని, 60వ డివిజన్ కార్యదర్శి పాపారావు. 61 వ డివిజన్ కార్యదర్శి కే రామరాజు. ప్రజా నాట్యమండలి కార్యవర్గ సభ్యులు ఎస్ కే భాష, స్థానిక సీపీఐ నాయకులు కె. ఆదినారాయణ, కన్నయ్య, ఏ చంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

చలసాని ఆటోరిక్షా ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ 12వ మహాసభ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : చలసాని నగర్‌లోని సిద్ధం కృష్ణారెడ్డి భవన్‌లో చలసాని ఆటోరిక్షా ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ 12వ మహాసభ యూనియన్ అధ్యక్షులు యర్రా రాములు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ మహాసభకు ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ విజయవాడ నగర గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర నాయకులు ధోనేపూడి శంకర్ హాజరయ్యారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య, రమణబాబు, ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి గూడెల జనార్దన్, నాయకులు కోరె వెంకచ్చి, సుబ్రమణ్యం ఆహ్వానితులుగా హాజరయ్యారు. నూతన కమిటీ ఎన్నిక- గౌరవాధ్యక్షులుగా జల్లి చిన్నారావు, అధ్యక్షులుగా గోసాల జోజి, ఉపాధ్యక్షులుగా ఖాశీం, కార్యదర్శిగా గొట్టిముక్కల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కూరాకుల సుధాకర్, కోశాధికారి చింతల శ్రీనివాసులును ఎన్నుకున్నారు. కార్యవర్గ కమిటీ గౌరవసలహా దారులు గోసాల రవి, చింతగుంట్ల సుధాకర్, జల్లి కుమార్, యర్రం కోటయ్య, కే.నాగేశ్వరరావు, తిరువూరి ఖాశీం, గాదె సాంబిరెడ్డి, కే.ప్రసాద్ నూతన కమిటీని నియమించారు.

కమ్యూనిస్టు ప్రణాళిక దినోత్సవం



విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో మంగళవారం 175వ కమ్యూనిస్టు ప్రణాళిక దినోత్సవం నిర్వహించారు. నగర పంచాయతీ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ సీనియర్ నాయకుడు పసుపులేటి వెంకయ్య మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి, కార్మిక వర్గం మనుగడకు కమ్యూనిస్టు ప్రణాళిక ఒక దిక్సూచి వంటిదన్నారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అన్న పదాలను విప్లవోద్యమాలకు పరిచయం చేసింది కమ్యూనిస్టు పార్టీయేనని వెంకయ్య గుర్తు చేశారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా కమ్యూనిస్టు పార్టీ నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉందని తెలిపారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం, కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకులు చేసిన త్యాగాలను, పోరాట పటిమను వివరించారు. ఏఐవైఎఫ్ టౌన్ సెక్రటరీ మాలపాటి ఉదయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్ కే సుబాని, ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎస్ కే నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామి పనిదినాల సాధించాలి



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో ఉపాధి హామి పథకం ద్వారా కూలీలకు మార్చికి 77 లక్షల పనిదినాలు కల్పన లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇప్పటి వరకు 64 లక్షల పని దినాలను కల్పించినా మరో 13 లక్షల పనిదినాలను కల్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధి హామి పనుల ప్రగతిపై మంగళవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామి పథకంలో కూలీలకు పనిదినాలను కల్పించడంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడీలు పీ.పద్మ, మణికుమార్, మున్ని, ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రమీల, అనురాధ, జనార్ధన్, సంతోషి, సంపత్ పాల్గొన్నారు.

'బెస్ట్ యూనివర్సిటీ కాదు.. వరస్ట్ యూనివర్సిటీ'
యూనివర్శిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ : యూజీసీ పర్మిషన్స్ అండర్ ప్రాసెస్‌లో ఉండగానే అక్రమంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న సత్య సాయి జిల్లాలో ఉన్న బెస్ట్ యూనివర్సిటీనీ టర్మినేట్ చేయాలని విద్యార్థి మనోహర్ ఆత్మహత్యకి పాల్పడే విధంగా ప్రేరేపించిన డిప్యూటీ వైస్ ఛాన్సలర్ చిత్రరాయి సెల్వన్, డైరెక్టర్ రాజన్నలను వెంటనే అరెస్టు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు తాడేపల్లిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి రాష్ట్ర కార్యాలయం నందు మంగళవారం మండలి చైర్మన్ కె.హేమచంద్రా రెడ్డిని కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి యం.సాయి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్ జీ మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలో ఉన్న ప్రయివేటు బెస్ట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ యాజమాన్యం అధిక ఫీజుల పేరుతో విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారని అందుకే నాల్గవ సంవత్సరం చదువుతున్నటువంటి మనోహర్ అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం తో విద్యార్థులు స్వచ్ఛందంగా క్లాసులు బహిష్కరించి యూనివర్సిటీ ముందు బైఠాయించారన్నారు. వారికి మద్దతుగా వారి సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి మద్దతిస్తుందన్నారు. యూనివర్సిటీలో అక్రమంగా వేస్తున్న జరిమానాలను వేయకుండా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యం యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు ఇవ్వకుండానే అండర్ ప్రాసెస్‌లో ఉండగా అక్రమంగా అగ్రికల్చర్ కోర్సుకు రూ.4 లక్షల ప్యాకేజీకి రూ.9 లక్షలు ఇవ్వాలని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి సెమిస్టర్ ఫీజును కొద్ది నెలల క్రితమే రూ. 300 నుండి రూ.800 గతంలో పెంచారని మరలా రూ.800 నుండి రూ.1200 వరకు పెంచి అక్రమంగా డబ్బులు దండుకుంటున్నారని చెప్పారు. గతంలో కూడా సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదన్నారు. ఈ అంశంపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె. హేమ చంద్రారెడ్డి స్పందించి ఈ బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర నాయకులు బేవర సుధీర్, జగదీష్, రంజిత్, అభిషేక్, బెస్ట్ యూనివర్సిటీ విద్యార్థి అమృత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీ టికెట్ల వ్యాపారుల ఆగడాలకు పోలీసుల చెక్

విశాలాంధ్ర- కంచికచర్ల: పట్టణంలో గత కొంతకాలంగా లాటరీ టికెట్లు అమ్మకాలు జరుగుతున్నాయని నందిగామ రూరల్ సీఐ నాగేంద్ర కుమార్, ఎస్సై సుబ్రహ్మణ్యానికి అందిన సమాచారం మేరకు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది. కంచి చర్ల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మంగళవారం ప్రవేశపరిచారు. ఈ సందర్భంగా ఏసీపీ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ కంచికచర్ల గ్రంథాలయం వద్ద లాటరీ టికెట్లు అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది గ్రంథాలయం వద్దకు వెళ్లగా పోలీస్ సిబ్బందిని చూసి పారిపోతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ప్రభుత్వం నిషేధించిన లాటరి టికెట్లను విజయవాడకు చెందిన దీపక్ అను వ్యక్తి వద్ద కొనుగోలు చేసి ఈ ప్రాంతానికి తీసుకువచ్చి ఇక్కడి ప్రజలకు లాటరీ తగిలితే కోటీశ్వరులు అవుతారని మోసపూరిత మాటలు చెప్పి అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. కంచికచర్ల కు చెందిన రాఘవరపు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్, జల్లి ఏసోబు, దేవి రెడ్డి విగ్నేశ్వర రావు అనేవారు దీపక్ లాగే లాటరీ టికెట్లు కొన్ని కంచికచర్ల మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అమ్ముతున్నారని వివరించారు. షేక్ జాన్ భాష, నగిరి కంటి ఏసోబు, గోసిపాత సీతారాములు, షేక్ బాబావాలి, మీసాల సర్వేశ్వరరావు అనే వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని దీపక్, వంగపండు శ్రీనివాసరావు, అరుణ, రాగవరపు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్, జల్లి ఏసు, దేవి రెడ్డి విగ్నేశ్వర రావు పరారీలో ఉన్నట్లు తెలిపారు.లాటరీ టికెట్ లాంటి మోసపూరిత వ్యాపారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటువంటి వ్యాపారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మీ ప్రాంతాలలో లాటరీ వ్యాపారాలు నిర్వహించే వారి వివరాలు తెలపాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసిపి నాగేశ్వర రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ కంచికచర్ల ఎస్సై సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా వరిలో... ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి : డీడీఏ

విశాలాంధ్ర-తిరువూరు: దాళ్వా వరిలో మేలైన సస్యరక్షణ చర్యలు, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా శిక్షణా కేంద్ర సమన్వయ కర్త డాక్టర్ టీ మాధవీ లత సూచించారు. మండలంలోని మునుకుళ్లలో ఎన్టీఆర్ జిల్లా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ వరి పైరు లో కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, ఆకు ముడత పురుగుల యాజమాన్యం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఏడీఏ జీ కెనడి, ఏడీఏపీ మోనిష, సర్పంచ్ వేమూరి రవి కుమార్, ఏవో పీ పద్మ, వీఏఏ లు శ్వేత పాల్గొన్నారు.

గిరిజన రాజకీయ ప్రాధాన్యత కల్పించారు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : గిరిజన పక్షాన నిలబడి అహర్నిశలు గిరిజనుల అభ్యున్నతికి కు కృషి చేస్తున్న డాక్టర్ కుంభ రవిబాబు ను ఎం ఎల్ సీ అభ్యర్థిగా ప్రతిపాదించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి యావత్ గిరిజన



జాతి హర్షం వ్యక్తం చేస్తుందని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మానుపాటి నవీన్ అన్నారు. మంగళవారం విజయవాడ కరెన్సీ నగర్లో గల గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రజా సంఘాలకు నాటి పాదయాత్రలో మాట ఇచ్చిన విధంగా గిరిజన రాజకీయ ప్రాధాన్యత కల్పించే విధంగా సమర్థుడైన నాయకుడికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం వల్లే గిరిజన అభ్యున్నతికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రనాయిక్, కుంభ ఉదయ్ కుమార్, తోకల చినవిరోజి, కుంభ గోపి, కుతడి భులక్ష్మి, బొజ్జగాని పద్మ, దేవరకొండ సాంబయ్య, మానుపాటి నవీన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం : ఎమ్మెల్యే వసంత



విశాలాంధ్ర-రెడ్డిగూడెం : ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డేనని అన్నారు. మండలంలోని మద్దులపర్వ సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షులు బలగాని తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ వెండి తాపడానికి రూ.10 వేలు విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలోని అంకమ్మ తల్లి వెండి తాపడం కు ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం మరియు గ్రామ వాస్తవ్యులు బింజి. శ్రీనివాసరావు. ఉమాదేవి దంపతులు రూ.10 వేలు ఆలయ ఏ ఈ ఓ తిరుమలేశ్వరావు చేతుల మీదుగా అందజేశారు.అనంతరం వారికివేద పండితులు పూజారులు ప్రత్యేక పూజలుచేసి ఆశీర్వాధించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ తనిఖీదారు జె ఎస్ వి ప్రసాద్ సిహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన రైతులు

విశాలాంధ్ర-వత్సవాయి: సాగర్ కాలువ నుండి నీరు సక్రమంగా విడుదల చేయక పోతుండడంతో మండల కేంద్రమైన వత్సవాయితోపాటు కంభం పాడు రైతులు సాగర్ కాలువ వద్ద ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు దిగువ ప్రాంతంలోని పంటలు ఎండిపోతుండడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళనకు దిగి సుమారు గంటన్నర పాటు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు... పోలీస్ అధికారుల హామీతో నిరసన విరమించిన రైతులు ఎన్ఎస్పి డిఈ తో మాట్లాడి కింద ప్రాంతాలకు నీటిని సక్రమంగా అందించాలని కోరారు దీనితో డిఈ సానుకూలంగా స్పందించారు.

వీరులపాడు మండల టీడీపీ అధ్యక్షుడు హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర-వీరులపాడు:గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై మరియు పార్టీ కార్యాలయం పై సోమవారం వైకాపా నాయకుల దాష్టీకాన్ని నిరసిస్తూ టీడీపీ చలో గన్నవరం కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ఆ కార్యక్రమానికి వెళ్ళనీయకుండా వీరులపాడు మండల తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్ మంగళవారం ఉదయం కొణతాలపల్లి గ్రామములో హౌస్ అరెస్టు చేసిసారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఎన్టీఆర్ జిల్లా నందిగామ కాపురస్తులైన **వాసిరెడ్డి ఫణి కుమార్ S/o. ప్రసాదరావు** అను నాకు సోమవరం గ్రామంలో (సర్వేనెంబర్ 619) పొలం ఉన్నది. ఈ పొలానికి సంబంధించిన **208/1 నెంబర్** గల డాక్యుమెంటు, **బి677/201** నంబర్లు గల లింకు డాక్యుమెంట్లు **తేదీ 18-02-2023** ఎన్టీఆర్ జిల్లా నందిగామ రైతు పేట నందు జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా పోయినవి. దొరికిన వారు కింద నెంబర్‌కు వెంటనే తెలియజేయగలరు **ఫోన్ 9700640180**

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE:: VIJAYAWADA

E.P.No.93/2021 in O.S.No.233/2006

Between:
M/s. Chalapathi Chit Fund (P) Ltd., Guntur, Rep. by its Manager/Foreman. **- DHR**
AND
Maguluri Venkateswarlu and others **- JDRS**
To,
JDR No-1: Maguluri Venkateswarlu, S/o. Narayana(Late), R/o. Door No.77- 135-1/2, Visalandra Nagar Colony, Rajiv Nagar Road, Payakapuram, Vijayawada -15, Krishna Dist.,
JDR No-2: Golla Peraiah, S/o. Narasimham, R/o. Door No.21-10/7-11, 5th Line Sri Nagar Colony, S.N Puram, Vijayawada, Krishna Dist.,
JDR No-3: Bandla Sita Ramaiah, S/o. Punnaiah, R/o. Door No.20-3/2-21/2, 2nd Line, Ayodya Nagar, Vijayawada, Krishna Dist.,
JDR No-4: Chegireddy Pothi Reddy, S/o. Yella Reddy, R/o.Door No.20-3/1-101, Near Vijaya Vinayaka Apartments, 1st Line, New Ayodya Nagar, Vijayawada, Krishna Dist.,

Whereas the DHR filed the above E.P. against the JDRs and sought for arrest. The Hon'ble Court ordered notices to **JDRS 1 to 4, U/O.21 R.22 and posted the EP to 09-03-2023.** As such, take notice that the above EP stands posted to 09- 03-2023 and you are hereby warned to appear before the Hon' Court either in person or through Advocate duly instructed on the **09-03-2023 at 10.30 a.m.**, failing which the above E.P. will be heard and disposed ex-parte.

(BY ORDER OF THE HON'BLE COURT)

SUNKARA RAJENDRA PRASAD,
Advocate for DHR, VIJAYAWADA.

లోన్‌యాప్ వేధింపులకు ఒకరి బలి
- విజయ డెయిరీ టెక్నిషియన్ ఆత్మహత్య
- మృతి వెనుక వాస్తవాలు వెలుగులోకి...



విశాలాంధ్ర-విజయవాడ క్రైం /చల్లపల్లి : లోన్‌యాప్ నిర్వాహకులు వేధింపులకు మరో ప్రాణం బలైపోంది. ఏడాది వయస్సు ఉన్న బాబుకు ఈ తండ్రి లోన్‌యాప్ వేధింపులకు లోకానికి విడిచిపోయాడు. ఈ విచారణ ఘటన విజయవాడ గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అరండల్‌పేట మసీదు వీధికి చెందిన బాబ్ జాన్(30) విజయ డెయిరీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఏడాది వయస్సు ఉన్న ఒక బాబు ఉన్నాడు. మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు జిల్లాలోని దర్గాలో తన బాబుకు పుట్టింటులు తీయించాడు. తిరిగి ప్రయాణంలో అతని భార్య ఒంగోలు తన బంధువుల ఇంటికి వెళ్లారు.ఈనెల 20వతేదీన ఇంటికి వచ్చి బాబ్జాన్ ఎవరులేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతి వెనుక గవర్నర్‌పేట పోలీసులు వాస్తవాలు వెలుగులోకి తెచ్చారు. లోన్ యాప్ వేధింపులకు ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించున్నాడు. లోన్ యాప్ నిర్వాహకులు అసభ్యకరమైన ఫోటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పెట్టారు. దీనికి మనస్థాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ టైర్ పేలి కార్మికుడు దుర్మరణం

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: గొల్లపూడిలో విషాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ ట్రైర్ పేలి కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈఘటన మంగళవారం విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరుకు చెందిన అన్వర్(45) గొల్లపూడి ఆంజేయ స్వామిగుడి సమీపంలో పంచర్ల దుకాణంలో పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం ట్రాక్టర్ డ్రైవర్ టైర్‌కు గాలి కొట్టించుకునేందుకు వచ్చాడు. గాలి పెట్టిన అన్వర్ కొద్దిసేపటికే ట్రైర్ ఒక్కసారిగా పేలి అక్కడిక్కడే మృతి చెందగా, చెయి భాగంగా కొంత దూరంలో విరిగిపడింది. స్థానికులు భారీ శబ్దానికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఆరు కేజీల గంజాయి విజయవాడ టూటౌన్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మైనర్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. చిట్టినగర్‌కు చెందిన మైనర్‌తో పాటు మాతంగి భార్గవ్(35), కుప్పల గంగాధర్(19) అరెస్టు చేశారు. వైజాగ్‌లోని పాడేరు ప్రాంతం నుండి గంజాయి తీసుకుని రైలు మార్గంలో విజయవాడ వించిపేట రైల్వే యార్డ్ వస్తుండంగా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ సుబ్రమణ్యం తమ సిబ్బంది దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఒక్కరి నుండి రెండు కేజీల చొప్పున 6కేజీల గంజాయి లభించింది. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైసీపీ పాలనకు వ్యతిరేకంగా నిరసన

విశాలాంధ్ర-ఏ కొండూరు : వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన పరికాష్టకు చేరిందని సోమవారం గన్నవరం టిడిపి కార్యాలయం పై వల్లభనేని వంశీ అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని ఎ కొండూరు మండల టిడిపి అధ్యక్షుడు గద్దే కృష్ణారెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం లోని చీమలపాడు గ్రామంలో స్థానిక పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగిస్తుందని గన్నవరం ఎమ్మెల్యే వంశీ అనుచరులు టిడిపి ఆఫీస్ ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు పార్టీ ఆవరణలో ఉన్న కార్లను సైతం నిప్పు పెట్టారని మంటలు ఆర్పేందుకు వస్తున్న ఫైర్ ఇంజన్ ను కూడా వైసీపీ గూండాలు అడ్డుకున్నారని ఈ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఈ రౌడీ పాలనపై గద్దే నిప్పులు చెరిగారు. గన్నవరంలో టిడిపి నాయకుల ఇళ్ళ మీద పార్టీ కార్యాలయం మీద జరిగిన దాడికి రాష్ట్ర ప్రభుత్వం బిజెపి పూర్తి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో బీసీ సెల్ నాయకులు బెజవాడ శంకర్ . వనపర్ల దేవిడ్ రాజు భీమా నాయక్ కిషోర్ ఆదం షరీఫ్ కరిముల్లా వీరయ్య సుబ్బారావు సాయి పాల్గొన్నారు.

26న కృష్ణానదిలో ఈత పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 26న ఉదయం 6,00 గంటలకు 1.5 కి.మీ. కృష్ణా నదిలో దుర్గా ఘాట్ నుండి నదికి దక్షిణ వైపు ఉన్న ఫుడ్ సిటీ వరకు 5 విభాగాలుగా ఈత పోటీలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ సెక్రటరీ మందపాటి లక్ష్మీనరసరాజు, ఈవెంట్ కన్వీనర్ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఈవెంట్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అరోగ్యమే మహా భాగ్యం ప్రతి ఒక్కరు తమ అరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం పలు రకాలుగా చేస్తూ ఉంటారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి సంరక్షకులు ఈనెల 18 నుండి 24 వరకు అసోసియేషన్ ఆఫీస్‌లో తమ పాస్ పోర్టు ఫోటోలు, వయస్సు ధ్రువీకరణ సర్టిఫికెట్ అప్లికేషన్ పూర్తి చేసి రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలు కొరకు ఈవెంట్ కన్వీనర్ యర్రంశెట్టి శ్రీనివాసరావు(9392107106), సెక్రటరీ మందపాటి లక్ష్మీ నరసరాజు (9533816767), ఆఫీస్ (9014754679) సంప్రదించగలరు. అసోసియేషన్ వెబ్‌సైట్‌లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ లింగిపిల్లి రామకృష్ణ,తమ్మా ఉమామహేశ్వరరెడ్డి,కర్రి సాంబయ్య,తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర-కంచికచర్ల: జగనన్న కాలనీ కు వెళ్ళే గ్రావెల్ డొంక రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి నిధులు కేటాయిస్తున్నారని అన్నారు కంచికచర్ల గ్రామంలో జుజ్జూరు రోడ్డులో దీక్ష కాలేజీ నుండి జగనన్న కాలనీ వరకు మండల పరిషత్ నిధులు12లక్షలరూపాయలతో చేపట్టిన డొంక రోడ్డు నిర్మాణ పనులకు శాసనస మండల పరిషత్ ద్వారా మంజూరైన12 లక్షల నిధులతో గ్రామంలోని జగనన్న కాలనీ వరకు గ్రావెల్ డొంక రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువ నిర్మాణంలో పారిశుధ్య పనులు మెరుగుపడతాయన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని,గత పాలకుల చేతుల్లో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన అనేక గ్రామాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సునీత, పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎంపిపి షేక్ మలక్ బషీర్, మండల వైసిపి అధ్యక్షుడు, ఎంపిటీసి నన్నపనేని నరశింహరావు, మాదుగుల మధు, ఎంపిడిఓ బాలశంకర్, పంచాయతీ రాజ్ ఎఈ రవికుమార్ హౌసింగ్ ఏఈ ఆకుల నరశింహరావు, కార్యదర్శి కనగాల రవికుమార్, ఇల్లా సుబ్బారావు,సుభాని, మాజీ ఎంపిటిసిలు వేల్పుల శ్రీనివాసరావు, శేషం వాసు, షేక్ రజీమ్ మాష్టారు, వార్డు సభ్యులు గ్రంధి ఆదిత్య, బండారుపల్లి శభరి, శ్యామ్,గోపి, కీసర ఉపసర్పంచ్ చలమాల ప్రభాకర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐ క్రియేషన్స్ వాక్ ఫర్ చారిటీ ట్రెడిషనల్ ఫ్యాషన్ షో

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : ఐ క్రియేషన్స్ ఐకానిక్ మోడల్, వాక్ ఫర్ చారిటీ ట్రెడిషనల్ ఫ్యాషన్ షో నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ తరుపున కాన్సర్ పేషెంట్‌కు మెడికల్ అలవెన్సు మరియు స్టూడెంట్స్‌కి 1,60,000 రూపాయల స్కాలర్‌షిప్‌లు ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా సి ఛానల్ ఎండి రమేష్, యాక్ట్రెస్ అంకిత బ్రహ్మ, డాక్టర్ శరత్‌బాబు, నెఫ్రాలజిస్ట్, విజయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మరియు పోజ్ యూని సెక్స్ సెలూన్ ఎండి రాకేష్‌లు హాజరయ్యారు. అలాగే మిస్సెస్ ఇండియా రన్నర్ అప్ స్నేహా చౌదరి, ఫ్యాషన్ డిజైనర్ మైని, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ కరంబీర్ కౌర్, క్యాస్టింగ్ డైరెక్టర్ నవీన్‌బాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఏపి టూరిజం కూడా సహకారం అందజేశారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు ఐ క్రియేషన్స్ ఫౌండర్ ఇమ్మానియేల్ పోకల్కర్ అవార్డులు ప్రధానం చేసారు.

సౌత్‌జోన్ వర్సిటీ ఛాంపియన్‌షిప్‌కు డాక్టర్ వైయస్సార్ వర్సిటీ క్రికెట్ జట్టు

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : ఈనెల 23 నుంచి మార్చి 3 వరకు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ పురుషులకు ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ ఛాంపియన్‌షిప్ కు డాక్టర్ వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ జట్టును యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ ఈ త్రిమూర్తి ప్రకటించారు. ఎంపికైన జట్టుకు కోచ్ గా డాక్టర్ కే శ్రావణ్ (ఫిజికల్ డైరెక్టర్, శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజ్, తిరుపతి), మేనేజర్ గా జే ఎస్ బాబు(ఫిజికల్ డైరెక్టర్ నారాయణ మెడికల్ కాలేజ్, నెల్లూరు) లు వ్యవహరిస్తారన్నారు.

జట్టు: జి.శివ నిరంజన్ రెడ్డి (ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్, చినకాకాని), సిహెచ్.నితిక్, డి.నిఖిల్, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, చినవుటుపల్లి), కేవి.సాయికిరణ్ (కర్నూలు మెడికల్ కాలేజ్, కర్నూల్), పి.ధనుంజయ్‌నాయుడు (ఆశ్రమ్ మెడికల్ కాలేజ్, ఏలూరు), డి.అశ్వత్(నారాయణ మెడికల్‌కాలేజ్, నెల్లూరు), ఎస్.అహ్మద్ బాబుల్ (రంగరాయ మెడికల్ కాలేజ్, కాకినాడ), పి.సునీల్ కుమార్, ఎస్‌జి.కుతుబ్ (జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్, రాజమండ్రి), ఎన్.నితిన్, పిఎన్‌వి.కౌశిక్(సిద్ధార్థ మెడికల్ కాలేజ్, విజయవాడ), జి రాకేష్‌చౌదరి(గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్స్, శ్రీకాకుళం), కె.ఆదిత్య (పిఈఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కుప్పం), ఆర్.పూర్ణ చందర్ (ఆంధ్ర మెడికల్ కాలేజ్, విశాఖపట్నం), టి. శివాజీ (ప్రభుత్వ దంత వైద్యశాల, కడప), కె.వెంకట ఉదయ్ కుమార్ (ఎస్ ఆర్ ఐ కాలేజ్ ఆఫ్ ఫిజియో థెరపీ, చిన్నకాకాని).

23న ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : యూనిఏక్స్‌పర్ట్ ఆధ్వర్యంలో ఈనెల 23 వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆస్ట్రేలియా అడ్మిషన్స్ డే నిర్వహిస్తున్నట్లు యూనిఏక్స్‌పర్ట్ ఏపి ఆపరేషన్ హెడ్ చైతన్య వాడవల్లి తెలిపారు. మంగళవారం వారి కార్యాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆస్ట్రేలియాలో విద్యను అభ్యసించాలను కునే విద్యార్థుల కోసం యూనిఏక్స్‌పర్ట్ ఆధ్వర్యంలో అడ్మిషన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆస్ట్రేలియాకు చెందిన 10 విశ్వవిద్యాలయాలు పాల్గొంటాయన్నారు. నేరుగా వారితో మాట్లాడి అడ్మిషన్ స్కాలర్ షిప్ విధానాన్ని గురించి తెలుసుకొని అలాగే స్పాట్ అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు అడ్మిషన్ నేరుగా పొందవచ్చును అని తెలిపారు. ఈ సారి ఆస్ట్రేలియాలో అడ్మిషన్ పొందిన వారికి వర్క్ పర్మిట్ అవకాశం ఐదు సంవత్సరాల వరకు ఉంటుంది.గతంలో మూడు సంవత్సరాలు మాత్రమే ఉండేదన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఇతర వివరాలు కోసం 8978787855 సంప్రదించాలని కోరారు

క్రికెట్ విజేతలకు ట్రోఫీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వెలంపల్లి సాయి అవినాష్ మెమోరియన్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు మంగళవారం ట్రోఫీలు ప్రదానం చేశారు. విజయవాడ 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ సహకారంతో పోలవరపు సత్తి ఆర్గనైజింగ్ చేసిన గత పది రోజులుగా టోర్నమెంట్ నిర్వహించారు. బహుమతి ప్రదానం కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ హాజరై టోర్నమెంట్లో విజేతగా గెలిచిన ట్రికోసిసి ఫైనల్ లో గెలిచి ట్రోఫీ సొంతం చేసుకుంది ఫైనల్ విజేతకు రూ. 25వేలతో పాటు మెమొంటో అందజేశారు. రన్నరప్ సత్తి సిసి కి రూ.15వేలు, మెమొంటోను అందించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బక్షి సిసికి చెందిన మణీ రూ. 5వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర, చైతన్య రెడ్డి, ఇర్ఫాన్, మైలవరపు దుర్గారావు, ఆర్గనైజర్లు దుర్గారావు, రామకృష్ణ , రాము తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నోలో మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం విజయవాడ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మాతృభాషా దినోత్సవం నిర్వహించినట్లు రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె సుమలత తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగు సంస్కృత అకాడమీ పాలకమండలి సభ్యులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ గారు మాట్లాడుతూ తెలుగు భాషను రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను, భాష, సంస్కృతి, ఆచారాలను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ బి ప్రసాద్ బాబు, ఇగ్నో సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష తిరస్కారం కన్నతల్లి తృణీకారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : మాతృభాషా తిరస్కారం కన్నతల్లి తృణీకారం తో సమానమని, తెలుగు వినపడాలి,తెలుగు కనపడాలి అని అంతర్జాతీయ వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎమ్మెస్సార్ హైస్కూల్ లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు వెలుగు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో చదివేవారు కూడా మాతృభాష అయిన తెలుగును విస్మరించరాదని అన్నారు. కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ సిహెచ్ అమర్ సుధీర్, కోశాధికారి కె నాగేశ్వరరావు, స్కూలు స్పెషల్ ఆఫీసర్ జె నాగేశ్వరరావు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె మురళి మోహన్ రాజు, స్కూలు ప్రధానోపాధ్యాయురాలు పి శ్యామల, అన్నసంతర్పణ సమితి కార్యదర్శి గుండు దిలీప్ తదితరులు పాల్గొన్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా గుప్తాను ఘనంగా సత్కరించారు.

పాఠశాలలకు పారిశుధ్య సామాగ్రి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలలకు పారిశుధ్య సామాగ్రి వచ్చిందని ఎమ్మీవో సీహెచ్.రామకృష్ణ తెలిపారు. ఆయా విద్యాలయాల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసుకునేందుకు వినియోగించే క్లీనింగ్ సామాగ్రి, లిక్విడ్లు అందాయన్నారు. వీటిని విద్యాలయాల హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రోడ్లు విస్తరణలో చెట్ల తొలగింపు విచారం

విశాలాంధ్ర- నందిగామ: నందిగామలో పచ్చని చెట్లు తొలగింపు విచారకరమని పర్యావరణ సమితి అధ్యక్షులు రామిరెడ్డి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని చెట్లను తొలగింపు పై ఆందోళన వ్యక్తం చేశారు.అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై , స్థానిక ప్రజాప్రతినిధుల పై ఉందన్నారు. నందిగామ పట్టణంలో గాంధీ సెంటర్ నుండి చందర్లపాడు రోడ్డు- రామన్నపేట రోడ్డు- కోర్టు రోడ్ ల విస్తరణలో భాగంగా ఎన్నో ఏళ్లుగా ప్రజలకు నీడనిస్తున్న భారీ వృక్షాలను తొలగించటం బాధాకరం అన్నారు.

నగదు రహిత లావాదేవీలు మరింత పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు ప్రయాణికులను యూటీఎస్ యాప్, ఏటీవీఎం డిజిటల్ ద్వారా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని చేస్తోందని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పేర్కొన్నారు.యుటిఎస్ యాప్ ఎటివిఎమ్‌ల ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం కోసం వాణిజ్య సిబ్బందికి మంగళవారం డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డీసీఎం రాంబాబు, నార్త్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ వి.రవివర్మ చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికేట్‌లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎస్ యాప్ ఎటివిఎమ్‌ల యాప్ ద్వారా డివిజన్‌లో సగటు టికెట్ వాటా ప్రస్తుత సంవత్సరంలో 10% పెరిగిందన్నారు. డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక ప్రచారాలు, రైలులో అవగాహన డ్రైవ్‌ల ద్వారా ప్రయాణీకులను చేరుకోవడంలో,డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో అంకితభావంతో కృషి చేసినందుకు వాణిజ్య సిబ్బందిని అభినందించారు.యూటీఎస్ యాప్, ఏటీవీఎం డిజిటల్ నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలా కృషి చేస్తోందని, ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో, డివిజన్ అంతటా క్రమం తప్పకుండా అవగాహన డ్రైవ్‌లు నిర్వహించడం వల్ల యూటీఎస్ యాప్, ఏటీవీఎంల ద్వారా సగటు టికెట్ వాటా 17% వరకు పెరిగిందన్నారు. సాధారణ ప్రయాణికులు బుకింగ్ కౌంటర్ల వద్ద క్యూలను నివారించాలని, క్యాష్‌లెస్,పేపర్‌లెస్ లావాదేవీలను సులభతరం చేసే ఈ యాప్ సేవలను పొందాలని కోరారు. అలాగే ఆర్-వ్యాలెట్ ద్వారా ప్రతి రీఛార్జ్‌పై 3% బోనస్‌ను పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 45 లక్షల మంది యుటిఎస్ యాప్ సేవలను ప్రయాణికులు ఉపయోగించుకున్నారు, విజయవాడ డివిజన్‌లోని మొత్తం ప్రయాణీకులలో 12.5% వాటా ఉందన్నారు. గత ఏడాది డిసెంబర్ నుండి ఈ జనవరి నెలలలో వారి సంబంధిత స్టేషన్లలో ఎటివిఎమ్‌ల యుటిఎస్ యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో మంచి ప్రతిభ ప్రదర్శించిన బుకింగ్ ఆఫీస్ నుండి 9 మంది సిబ్బంది, టికెట్ చెకింగ్ సిబ్బందికి మెరిట్ సర్టిఫికేట్‌లు అందించారు.సర్టిఫికేట్‌లు పొందిన వారిలో చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ కె. శ్రీనివాస్(భీమవరం టౌన్),బుకింగ్ సూపర్‌వైజర్ పి. లక్ష్మి(అన్నవరం), చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎ.వేంకటేశ్వరులు(గూడూరు),పార్శిల్ సూపర్‌వైజర్ ఎ. శ్రీనువాసుల రెడ్డి (చీరాల),బుకింగ్ సూపర్‌వైజర్ ఇ. ప్రసాద్(నిడదవోలు), ట్రావెలింగ్ టికెట్ ఇన్స్పెక్టర్ బి. అనిల్ (కావలి),బుకింగ్ సూపర్‌వైజర్ కె.ఎస్. గోపీనాథ్(నెల్లూరు),కమర్షియల్-కమ్-టికెటింగ్ క్లర్క్ డి.భాస్కరరావు(అనకాపల్లి), కమర్షియల్-కమ్-టికెటింగ్ క్లర్క్ కె. ప్రభాకర్(భీమవరం టౌన్),ఛీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎస్‌కె సందాని భాషా(కావలి), బుకింగ్ సూపర్‌వైజర్ పి.రామలక్ష్మీ(అన్నవరం) ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు కేటాయించకుండా అవమానించారు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు స్థానం లేకుండా చేసి తీవ్రమైన అన్యాయం చేశారని టీడీపి ముదిరాజ్ సాధికారిక కన్వీనర్ పి.ఎల్ రావు మండిపడ్డారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 29 లక్షల మంది జనాభా గల ముదిరాజ్ సామాజికవర్గాన్ని జగన్ ప్రభుత్వం విస్మరించిందన్నారు.నిన్న జరిగిన ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో ముదిరాజ్ లకు స్థానం కేటాయియించలేదని అన్నారు.ముదిరాజ్ సామాజికవర్గం అని చెప్పుకునే మంత్రి విడుదల రజని ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.అసలు ఆమె తమ సామాజిక వర్గమేనా అన్ని ప్రశ్నించారు. తమ సామాజికవర్గాన్ని జగన్ అవమానించారని చెప్పారు.వైసీపీలో ఉన్న ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన నాయకులు వెంటనే రాజీనామా చేసి బయటకు రావాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ సామాజికవర్గానికి న్యాయం చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమే అని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో సాదనాల ప్రసాదరావు,సాగనబోయిన ఆనంతరాజు,సిరివెల్లి శ్రీనివాసరావు,దొంతాల బుచ్చి రామయ్య,పేరం వెంకటరామరాజు,కోమటి శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అల్లరి మూకల దాడిని ఖండిస్తున్నాం

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: టీడీపీ అల్లరి మూకల దాడిని ఏపీ పోలీస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర జనరల్ సెక్రటరీ మస్తాన్ ఖాన్ మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతల పర్యవేక్షించే మాపై జరిగే ఇలాంటి దాడులు మంచిది కాదన్నారు. .గన్నవరం లో శాంతి భద్రతలు కాపాడుతున్న పోలీసులు పై ప్రత్యేకించి సీఐ కనకారావు, ఎస్సై, మహిళా సిబ్బంది పై, తెలుగుదేశం నాయకుడు పట్టాభి ఆధ్వర్యంలో అల్లరి మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరచటానికి ఖండిస్తున్నామన్నారు. .ఇటీవల కాలములో కొన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయ ఎజెండాలను ప్రక్కన పెట్టి తీవ్ర వత్తిడి కి లోనై పరోక్షంగా తమ అసహనాన్ని పోలీస్ వారిపై చూపిస్తున్నారని, ప్రత్యేకించి ప్రతిపక్షము లో ఉన్న కొంత మంది నాయకులు తరచూ వారి నాయకులు ఇచ్చేటువంటి సూచనల మేరకు పోలీస్ వారిని లక్ష్యం గా భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. రాజ్యాంగ బద్ధమైన విధులు నిర్వహించి ప్రజల ధన, మాన, ప్రాణాలు రక్షించే పనిలో అహర్నిశలు కష్ట పడే మా పై అధికారులపై పరుష పదజాలం తో వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారన్నారు. ఇక ముందు ఇటువంటి చర్యలు జరిగితే చట్టభద్ధంగా న్యాయబద్దంగా తీవ్రమైన చర్యలు తీసుకోవటం జరుగుతుంది అని సంఘం హెచ్చరించింది. కృష్ణా జిల్లా అధ్యక్షులు జయపాల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సోమయ్య, కృష్ణా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బెనర్జీ బాబు, తదితరుల పాల్గొన్నారు.

పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధితోనే అభివృద్ధి

విశాలాంధ్ర-వీరులపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించలన్నదే ప్రభుత్వం లక్ష్యమని జడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య పేర్కొన్నారు. వీరులపాడు మండలం వెల్లంకి జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కీర్తి సౌజన్య మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టనీ సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు నిస్తున్నారని అన్నారు. నాడు నేడు పథకం ద్వారా మండలం లో పాఠశాలల అభివృద్ధి చెందాయని,గత పాలకులు పాఠశాలలను విస్మరిస్తే వాటి అభివృద్ధి తోనే సమాజం మరింత ముందుకు వెళ్ళుతుందని సీఎం ఆకాంక్షిచారన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాను అందించలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల కు అందిస్తున్న బోధన సరళినీ అడిగి తెలుసుకున్నారు.

ఎక్సెల్ ప్లాంట్‌లో అభివృద్ధి పనుల పరిశీలన కమిషనర్ స్వప్నిల్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో కాల్ ఆన్ ఇండస్ట్రీస్ నిర్వహణలోని చెత్త వేయింగ్(వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి టోల్ గేట్‌లా ఈ ప్రాంతం భూమ్ బ్యారియర్ రేడియో ఏర్పాటు చేయాలనీ సూచించారు. ప్లాంట్ ఆవరణలో పూర్తి స్థాయిలో గ్రీనరీ పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా షేడింగ్ మిషన్ ద్వారా చెట్లు కొమ్మలను కటింగ్ విధానాన్ని పరిశీలించి ప్లాంట్ ఆవరణలోని కొమ్మలను తొలిగించాలని ఆదేశించారు. ప్లాంట్‌లో చెత్త వాహనాలు పార్కింగ్ ప్రదేశంలో ఉన్న చెత్తను పూర్తి స్థాయిలో తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం రాజీవ్‌నగర్‌లో నగర పాలక సంస్థ అధికారులచే నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించి ఆశ్రమంలో నిరాశ్రయులకు అందుబాటులో ఉన్న వసతి సదుపాయాలను నిర్వాహకులు, అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులను అడిగితెలుసుకున్నారు. సౌకర్యాలపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ, హాలులో పని చేయని ఫ్యాన్లుకు తక్షణమే మర్మమత్తులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమీషనర్ కేవీ.సత్యవతి, ఈఈలు సత్యనారాయణరావు, ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీ.హెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇనస్పెక్టర్లు పాల్గొన్నారు.

గృహసారధుల సేవలు ఎంతో కీలకం : సామినేని

విశాలాంధ్ర- పెనుగంచిప్రోలు : నూతనంగా నియమితులైన గృహసారధులు సచివాలయ కన్వీనర్లు ప్రతి కుటుంబానికి సన్నిహితంగా ఉంటూ గత ప్రభుత్వానికి,మన జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. మంగళవారం పెనుగంచిప్రోలు పట్టణంలోని జి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్,మరియు తంబరేణి గార్డెన్స్ నందు పెనుగంచిప్రోలు మండల గృహసారధులతో ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ,వారి తనయులు నియోజకవర్గ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు.శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చెయ్యాలని సూచించారు,ముఖ్యంగా కేటాయించిన గృహాలపై అహగాహణ కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు,అభివృద్ధి ప్రజలలోకి పూర్తీ స్థాయిలో తీసుకువెళ్లేలా ఉండాలని అన్నారు.వాలంటీర్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలని అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అని ముద్రించిన కరపత్రాలతో గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏమిచేశాడో,మన జగనన్న ఏమి చేసారో ప్రజలకు వివరించాలని అన్నారు. మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి.కుల మత,ప్రాంత,పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు,గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే తెలుగుదేశం నాయకులు చెప్పిన వారుకో లేదా పసుపు కండువా వేసుకున్నవారికే సంక్షేమ పథకాలు ఇచ్చేవారు అని అన్నారు,నేడు అలాంటి దుస్థితి లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారు అని అన్నారు, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి. మార్కాపూడి. గాంధీ. గ్రామ సర్పంచ్ వేల్పుల. పద్మ కుమారి. జెడ్ పి టి సి. ఊట్ల. నాగమణి. మండలస మై ఖ్య అధ్యక్షురా లు. కాకాని. పద్మ. ఎస్ సి సెల్ నాయకులు సామియేలు.మై నింగ్ శాఖకార్పొరేషన్ డై రె క్టర్ బత్తుల. రామారావు. దాసరి పూసల సంఘకార్పొరేషన్ డై రె క్టర్ చేని. కుమారి.మార్కెట్ యాడ్ డై రె క్టర్ సోమయ్య.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వేల్పుల. రవికుమార్.మండలవైసిపి అధ్యక్షులు ఊట్ల. నాగేశ్వర రావు.నాయకులు,కార్యకర్తలు,సచివాలయ కన్వీనర్లు,గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడికి నిరసన

విశాలాంధ్ర- కంచికచర్ల: గన్నవరం టిడిపి పార్టీ కార్యాలయం పైదాడిని ఖండిస్తూ మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో కంచికచర్ల టిడిపి కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం శ్రేణులతో కలిసి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం ఏలుబడి సాగిస్తున్నారు. ఈ ముఖ్యమంత్రి గన్నవరం మంగళగిరి పార్టీకార్యాలయాల పై దాడులునిర్వహించడం హీనమైన చర్య అని కోగంటి వ్యాఖ్యానించారు. వైసీపీ దిగజారుడు రాజకీయాలకు ఇదొక నిదర్శనం అన్నారు. మీ పరాకాష్టను తూధాముట్టించేందుకు సమయం దగ్గరలోనే ఉన్నదని, ఈ సైకో చర్యలు రాబోయే ఎన్నికల్లో ప్రజలుఖచ్చితంగా బుద్ధి చెప్తారన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం అవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గుత్త రత్నం, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అల్లడి కోటేశ్వరరావు, గొట్టుముక్కల గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గోగినేని అమర్నాథ్, గుత్తా ఓంకార్, గూడవల్లి గణేష్, కంచె రమేష్, బుడ్డి సూర్య ప్రకాష్, కోనేటి మాధవ, రాజేష్ చెన్నుపాటి వేణు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

సీఎస్ఐ మందిర నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-వీరులపాడు: కొణతాలపల్లి గ్రామం హరిజనవాడ నందు మంగళవారం దక్షిణ ఇండియా సంఘము సి ఎస్ ఐ సీయోను మందిరము పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో మంగళవారం ఉదయం స్థానిక వైకాపా నేతలతో కలిసి నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్మోహన రావు కార్యక్రమానికి హాజరు కాగా సాయంత్రం స్థానిక తెదేపా నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

23న రసాయన విపత్తులపై మాక్ ఎక్సర్‌సైజ్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచనల మేరకు రసాయన విపత్తులపై ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ మాక్ ఎక్సర్‌సైజ్ ఈనెల 23న జీ కొండూరు మండలం కట్టుబడిపాలెంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ విపత్తు ప్రతి స్పందన దళం, రాష్ట్ర విపత్తుల ప్రతి స్పందన దళంతో పాటు ప్రధాన ప్రమాద కర్మాగాలకు చ ఎందిన రెవిన్యూ, పోలీసు, అగ్నిమాపక సేవలు, వైద్య ఆరోగ్య, పరస్పర సహాయ సభ్యులు ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో పాల్గొంటారని తెలిపారు. కర్మాగారాల్లో పూర్తి స్థాయి భద్రత ప్రమాణాలు అమలు చేయటం, ఏదైనా ప్రమాదం సంబందించిన సందర్భంలో చేపట్టే చర్యలను వివరించే విదంగా నమూనా మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసిన తరువాత సుఖంగా జీవించటానికి గతంలో ఉన్న పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీల, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మారుతి లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, జాయింట్ ఫోరమ్ ఫర్ రెస్టోరేషన్ ఆఫ్ ఒపిఎస్ ఇచ్చిన పిలుపు మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ ఆధ్వర్యములో రైల్వేల కార్యాలయముల వద్ద నూతన పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస పెన్షన్ లేని నూతన పెన్షన్ రద్దు కొరకు కార్మికులందరూ పెద్దఎత్తున అందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. రైల్వే కార్మికులందరూ పాత పెన్షన్ విధానమునకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీ లకు మాత్రమే రానున్న ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే రైల్వేలను ప్రైవేటీకరణ దిశగా చేయటానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. రైల్వేలో లక్షలాది పోస్టులు కాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయకుండా ఉద్యోగులపై పని వత్తిడి తీసుకువస్తుందన్నారు. ఇప్పటికైన ఉద్యోగ ,కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చేపుతామని హెచ్చరించారు.ఈ నిరసనలో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజనల్ ట్రెజరర్ రామ గుప్త, సహాయ డివిజనల్ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక బ్రాంచ్‌ల కార్యదర్శులు అహ్మద్ షెరీఫ్, మోహన రావు, ప్రసాద్, క్రాంతి కుమార్, శ్రీనివాస రావు , భాను బాబు, వెంకటేశ్వర రావు , యూత్ కో ఆర్డినేటర్ అప్పల నాయుడు, విమెన్ కో ఆర్డినేటర్ హారిక, పెద్ద సంఖ్యలో రైల్వే కార్మికులు పాల్గొన్నారు.